బోనాలు సమర్పించి..





కుటుంబ సమేతంగా బోనాలతో వస్తున్న భక్తులు


మొక్కులు చెల్లించడానికి వస్తున్న భక్తులు


భక్తులతో కిక్కిరిసిన సూరారం కట్టమైసమ్మ ఆలయం

జాతర వైభవం




సూరారంలోని శ్రీకట్టమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ ప్రధాన జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జాతరకు స్థానికులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి మహిళలు కుటుంబ సమేతగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర నేపథ్యంలో ఆలయం చుట్టుపక్కల రాము రత్నాలు, షాపులు వెళ్లడంతో పల్లెటూరు వాతావరణం నెలకొంది. సూరారం లోని ప్రతి ఇంట్లో బంధువులు రాకతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద, బీజేపీ నేత మల్లారెడ్డి, కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సుభాష్‌నగర్

మొక్కులు చెల్లించి..





ఎమ్మెల్యే వివేకానందను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు


కట్టమైసమ్మను దర్శించుకోవడానికి వచ్చిన కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు

జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్



సుభాష్‌నగర్: జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దుండిగల్ డీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను నియమించారు. ఆదివానం ఆయన చార్జ్‌షీట్ తీసుకుని బాధ్యతలు తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నిబంధనలు అతిక్రమించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిచేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లో పర్యటించిన ఆయన దృష్టికి స్థానికులు రోడ్డు, నాలా సమస్యలను తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన భరతసింహారెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. కాలనీ అధ్యక్షులు యేసు, నార్లకంటి నరసింహ, సాయిలు, అంజయ్య, వీరేశం, సింహాద్రి, మల్లేష్, సోమయ్య, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ హెచ్‌ఏఎల్ రాఘవేంద్రకాలనీలో ఆదివారం శ్రీముత్యాలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిద్దిరాములు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సామాజిక విలువలను నేర్పించాలి


బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

రంగారెడ్డినగర్: విద్యార్థులు పదునైన ఆలోచనలతో భవిష్యత్‌లో అద్భుతాలు సృష్టించాలని కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు పేర్కొన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ రంగారెడ్డినగర్ ప్రాంతంలోని బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాలలో స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అభ్యసించిన పాఠ్యాంశాల ప్రదర్శన కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ వినోద్‌కుమార్ జాదవ్, లెడ్ ప్రతినిధులు కస్టమర్ సక్సెస్ డైరెక్టర్ మునిచౌదరి, అకాడమిక్ ఎక్సలెంట్ మేనేజర్ మాధవి, మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షులు బిర్రు ఆంజనేయులతో కలిసి ప్రారంభించారు.

◆ ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, సాంకేతిక నమూనాలను తిలకించిన ఎంఈవో విద్యార్థులను సృజనాత్మకతను ప్రశంసించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్ననాటి నుంచే మంచి విద్యతో పాటు సామాజిక విలువలను నేర్పించాలన్నారు. బాధ్యతతో కూడిన జీవన విధానాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి అలవర్చాలని సూచించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను, పాఠశాల యాజమాన్యాన్ని ఎంఈఓ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ఆయేషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్కస్.. అదుర్స్

- మూడు దశాబ్దాల తర్వాత గ్రేట్ బాంబే సర్కస్
- వేదికైన కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ గౌండ్



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ గ్రౌండ్‌లో గ్రేట్ బాంబే సర్కస్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. విదేశీ కళాకారులు అద్భుత విన్యాసాలు, సర్కస్ ఫీట్లతో సందర్శకులను అలరిస్తున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఆహ్లాదానికి, ఆనందాన్ని, కడుపుబ్బా నవ్వించడంతో పాటు కుటుంబ సమేతంగా అందరూ కలిసి వీక్షించే విధంగా గేట్ బాంబే సర్కస్ విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఏషియాలోనే అతిపెద్ద సర్కస్‌గా గుర్తింపు పొందిన గ్రేట్ బాంబే సర్కస్ 30 సంవత్సరాల తర్వాత నగరంలోని కుత్బుల్లాపూర్, హెచ్ఎంటీ గ్రౌండ్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా ఆరంభమైంది.

◆ కళాకారులు గాల్లో తేలుతూ చేసే అద్భుత విన్యాసాలు, మహిళలు సైతం అద్భుతంగా ప్రదర్శించే వివిధ రకాల స్టంట్స్ సర్కస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 60 అడుగుల ఎత్తులో గాలిలో ఫ్లయింగ్ ట్రాఫీస్, స్కైవాక్, రష్యన్ రింగ్ డ్యాన్స్, అరేబియన్ ఫైర్ డ్యాన్స్, చైనీస్ రోలా బోలా, మెక్సికన్ ఫుట్ బాస్కెట్‌బాల్, మంగోలియన్ ఐరన్ బాల్, చైనీస్ స్పాడ్ బ్యాలెన్స్, జోకర్స్ విన్యాసాలను 80 మంది దేశీయ, విదేశీయ కళాకారులతో అద్భుతమైన విన్యాసాలు, స్టంట్స్ జోకర్లతో కడుపుబ్బా నవ్వించే విన్యాసాలను హైలెట్‌గా నిలుస్తున్నాయి. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4గంటలకు తిరిగి రాత్రి ఒంటిగంటలకు మూడు షోలుగా ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.




నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్ విక్రయానికి యత్నం


దుండిగల్ పోలీసుల అదుపులో నిందితులు

నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు

దుండిగల్: నకిలీ పత్రాలు సృష్టించి ఓ ఖాళీ ప్లాట్‌ను విక్రయించేందుకు యత్నించిన నలుగురు వ్యక్తులను దుండిగల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కవాడీగూడ గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ అజామ్(47), దుండిగల్ ఔటర్‌రింగ్ సమీపంలో టింబర్ బిజినెస్ చేసే మహ్మద్ బాబాఖాన్(58), యూసఫ్‌గూడ గంగానగర్‌కు చెందిన సయ్యద్ ముజీబుల్లా ఖాద్రీ(34), బీరంగూడకు చెందిన చౌదరి సతీష్ బాబు (36), శేరిలింగంపల్లి ఆదర్శనగర్ కాలనీకి చెందిన తెల్లాపురం విజయ్‌కుమార్(35), కవాడీగూడకు చెందిన మహ్మద్ మజీద్‌ఖాన్(24)లు ముఠాగా ఏర్పడి రియల్ ఎస్టేట్ వ్యాపారుల ముసుగులో ఖాళీగా ఉన్న ప్లాట్లకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయిస్తూ పలు మోసాలకు పాల్పడుతూ వస్తున్నారు. వీరిపై పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటికే కేసులు నమోదయ్యాయి.

◆ ఈ క్రమంలో కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కృష్ణమూర్తికి దుండిగల్ మున్సిపల్ పరిధి దొమ్మరపోచంపల్లిలోని సర్వే నెంబరు 320, 322 నుండి 329, 348 సర్వే నెంబరులో 300 చదరపు గజాల స్థలం ఉంది. ఇటీవల ఆరుగురు డీపోచంపల్లిలో మందు పార్టీ చేసుకున్నారు. ఈ క్రమంలో ఖాళీగా పడి ఉన్న కృష్ణమూర్తి ప్లాట్‌పై వీరి కన్ను పడింది. అనుకున్నదే తడవుగా సదరు స్థలానికి జీపీఏ హోల్డర్‌గా ఉన్న అల్లూరి సుబ్బరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసి జీపీఏ హోల్డర్‌గా చౌదరి సతీష్‌బాబును పేర్కొంటూ నకిలీ డాక్యుమెంట్‌తో సదరు స్థలాన్ని సయ్యద్ ముజీబుల్లా ఖాద్రీ కి విక్రయించినట్లుగా పత్రాలు సృష్టించారు. దీనిపై సమాచారం అందుకున్న ప్లాట్ ఓనర్ కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ శంకరయ్య, ఎస్ఐ రాజేష్, సిబ్బందిని డీసీపీ నితిక పంత్ అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలో ఆదివారం శివాత్మిక క్లినిక్ లాబరేటరీ అండ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకుడు, యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పేదలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో శివాత్మిక క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సోమ చంద్రశేఖర్, డాక్టర్ మాధురి సోమ, డాక్టర్ హిమబిందు, డాక్టర్ సోమ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధర్మశాస్త దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

చింతల్: భగత్‌సింగ్‌నగర్ కాలనీలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీధర్మశాస్త (శ్రీఅయ్యప్ప స్వామి) దేవాలయ శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు భూపాల్‌రావు, శ్రీఅయ్యప్పస్వామి దేవాలయ కమిటీ సభ్యులు భూనేటి రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, జితేందర్‌రెడ్డి, సూర్యచంద్ర, శ్రీపతి సుధాకర్ సురేష్, నరేష్, దేవేందర్ గురుస్వాములు హరిహరరావు, నాగేశ్వరస్వామి, రామచంద్రారెడ్డి, కిష్టప్ప, మురళీకృష్ణ, శ్రీరాములు, శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు

ఇద్దరు మృతి



మృతులు శివకుమార్, కామేశ్వరరావు

నిజాంపేట్: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటనలు బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్‌లోని ఓ బేకరీలో పని చేసే శివకుమార్ (33) ఆదివారం పని మీద బాచుపల్లికి వచ్చాడు. బైక్‌పై వెళ్తున్న అతన్ని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల వద్ద వేగంగా వచ్చిన ఆటో ట్రాలీ ఢీకొట్టడంతో తీవ్ర గాయలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో..

◆ సాయినగర్ సిద్దిబాక్స్‌కు చెందిన కామేశ్వరరావు(53) ఆదివారం ఉదయం పాల ప్యాకెట్ తెచ్చేందుకు హోండా డాన్ బైక్ (ఏపీ 10ఏబీ 5116)పై సాయినగర్‌లోని దర్గా ప్రాంతానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో కింద పడిన కామేశ్వరరావు నుదుట భాగానికి తీవ్ర గాయం కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'చలో నల్లగొండ'ను విజయవంతం చేయాలి


చలో నల్గొండ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పాలకుల అనుభవ రాహిత్యంతో తెలంగాణ ప్రజలకు నీటి కష్టాలు తప్పవని.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను ఆ పార్టీ కేఆర్ఎంబీకి తాకట్టు పెట్టిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఈనెల 13న బీఆర్ఎస్ తలపెట్టిన 'చలో నల్లగొండ'బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమరవీరుల త్యాగాలపై సర్వజనులు ఏకమై కొట్లాడి సాధించుకున్న తెలంగాణ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సస్యశ్యామలంగా మారిందన్నారు. ఎంతో కష్టపడి నిర్మించుకున్న తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలకుల అనుభవ రాహిత్యంతో మరోమారు ఎడారిగా మారనుందన్నారు. చలో నల్లగొండ బహిరంగ సభకు అన్నివర్గాల ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వేణుయాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పిలియన్ సిగ్నల్స్ పనిచేస్తున్నాయ్'

సాక్షి ఎఫెక్ట్..


చింతల్ ప్రధాన రోడ్డులోని హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద పని చేస్తున్న పిలియన్ సిగ్నల్స్

రంగారెడ్డినగర్: పిలియన్ ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో రోడ్డు దాటేందుకు పాదచారులు పడుతున్న అవస్థలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చింతల్ ప్రధాన రోడ్డులోని హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద ఉన్న పిలియన్ సిగ్నల్స్ పనిచేయక పోవడంతో గత కొద్ది రోజులుగా రద్దీగా ఉండే రోడ్డును దాటేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ విషయమై ఆదివారం సాక్షిలో 'రోడ్డు దాటేదెలా?'శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు సిగ్నల్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపట్టిన గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ మేడ్చల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) రామ్మోహన్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపల్ పరిధి ప్రణయ్ అపార్ట్‌మెంట్స్‌లో చేపట్టిన గృహజ్యోతి పథక నమోదు కార్యక్రమాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉంటేనే 200 యూనిట్లు వరకు విద్యుత్ బిల్లులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి సెక్షన్ విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చెరువు స్థలంలో పరిశ్రమల నిర్వహణ

- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- ఇలాగే వదిలేస్తే చెరువు స్థలం కబ్జా చేస్తారంటున్న స్థానికులు

జీడిమెట్ల: చెరువు జాగాలో పరిశ్రమ పనులను నిర్వహిస్తున్న అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. అధికారుల అలసత్వంతోనే ఫాక్స్ సాగర్ స్థలాలు పూర్తిగా దుర్వినియోగం అవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కొంత మంది ఏకంగా చెరువు స్థలాన్నే కబ్జా చేస్తుండగా మరికొంత మంది చెరువు స్థలాన్ని ఆధీనంలోకి తీసుకుని పరిశ్రమ పనులను దర్జాగా నిర్వహించుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం మాదేం పోయింది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

అధికారుల సమన్వయ లోపమే ఫాక్స్‌సాగర్‌కు ముప్పు..

చెరువు జాగాను ఇతరులు కబ్జా చేయకుండా పట్టించుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు, చెరువు స్థలం ఎప్పటికప్పుడు అంచనా వేయాల్సిన రెవెన్యూ అధికారులు ఇరువురు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. చెరువు స్థలంలో స్యాండ్ బ్లాస్టింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి నుంచి అధికారులు ముడుపులు తీసుకుని వారిని ఏమీ అనడం లేదని పేర్కొంటునారు.

◆ పేదలు గుడిసె వేసుకుంటే వెంటనే తొలగించే అధికారులు కాసులు ఇచ్చే వారికి మాత్రం పరోక్షంగా సహాయ పడుతున్నారని అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు, కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోతే ఫాక్స్‌సాగర్‌కు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదని ప్రజలు అంటున్నారు. సంబంధిత అధికారులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.


చెరువు స్థలంలో నిర్వహిస్తున్న పారిశ్రామిక పనులు

రావినారాయణరెడ్డి కాలనీ అధ్యక్షుడిగా సాతాల గోపాల్


సాతాల గోపాల్‌ను సత్కరించిన రావినారాయణరెడ్డి కాలనీవాసులు

సుభాష్‌నగర్: గాజులరామరం డివిజన్ పరిధిలోని రావినారాయణ రెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాతాల గోపాల్ ఎన్నికయ్యారు. ఆదివారం నూతన కమిటీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. కాలనీలో 277 ఓట్లు ఉండగా వందశాతం ఓట్లు పోల్ అయ్యాయి. అందులో అధ్యక్ష పదవి బరిలో నిల్చున్న బి.నరసింహకు 136 ఓట్లు, సాతాల గోపాల్‌కు 140 ఓట్లు పడడంతో గోపాల్ నాలుగు ఓట్ల తేడాతో నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ.. కాలనీవాసులు తనపై నమ్మకం ఉంచి తనను కాలనీ ప్రెసిడెంట్‌గా ఎనుకున్నారని అన్నారు. వారికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

తప్పుడు లీజు అగ్రిమెంట్

ఇద్దరిపై కేసు నమోదు

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తికి చెందిన స్థలానికి సంబంధించి తప్పుడు లీజు అగ్రిమెంట్ సృష్టించి ఓ పరిశ్రమకు లీజుకు ఇచ్చిన ఇద్దరు వ్యక్తులపై పేట్‌బషీరాబాద్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.. పేట్‌బషీరాబాద్ సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సింగిరెడ్డి శంకర్‌రెడ్డి అనే వ్యక్తికి దూలపల్లి సర్వే నెంబరు 155లో 889 గజాల స్థలం ఉంది. కాగా సదరు స్థలం ఖాళీగా ఉండటంతో దూలపల్లి గ్రామానికి చెందిన దుర్గం రజనీకాంత్‌గౌడ్(37), దుర్గం శ్రీకాంత్‌గౌడ్(35) లు తప్పుడు లీజు డాక్యూమెంట్లను సృష్టించి తమ్మల నాగలక్ష్మి అనే మహిళ నిర్వహిస్తున్న వీఎస్ఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చి చుట్టూ ప్రీకాస్ట్ వాల్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై సదరు ప్లాట్ యజమాని శంకర్‌రెడ్డి పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నకిలీ పత్రాలు సృష్టించిన రజనీకాంత్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్‌లపై పలు సెక్షన్ల కింద ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన మేడ్చల్ ఏసీపీ రఘునాథ్‌రావు, పేట్‌బషీరాబాద్ సీఐ ప్రశాంత్, ఎస్సై ధర్మేష్‌లను డీసీపీ నితికా పంత్ అభినందించారు.

వ్యక్తి హత్య!


యాసిన్ బేగ్ (ఫైల్)

జీడిమెట్ల: ఓ వ్యక్తి హత్య ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీడిమెట్ల ఎస్సై హరీష్ వివరాల ప్రకారం.. నగరంలోని రసూల్‌పురాకు చెందిన యాసిన్ బేగ్(45) కొన్నేళ్ల క్రితం సుభాష్ నగర్ గంపలబస్తీ వచ్చి అక్కడే చిన్న పాన్ షాప్ నడిపేవాడు. రెండేళ్ల క్రితం పేట్‌బషీరాబాద్ పరిధిలో ఓ హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. అనంతరం తాను నడుపుతున్న పాన్ డబ్బాను విక్రయించి చిన్న చిన్న పనులు చేస్తూ జీవనం సాగిస్తూ ఓ అద్దె గదిలో ఒక్కడే ఉంటున్నాడు. కాగా ఆదివారం యాసిన్ ఉంటున్న గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు.

◆ అక్కడకు చేరుకున్న పోలీసులు తలుపులు తెరచి చూడగా యాసిన్ బేగ్ మృతి చెంది పడి ఉన్నాడు. కాగా అతని తల, మెడపై కత్తిపోట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా యాసిన్‌బేగ్‌ను పాతకక్షల నిమిత్తంలో ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. యాసిన్‌ను ఈనెల 9వ తేదీన అతడి గదికి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి హత్య చేసి వెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. యాసిన్‌బేగ్ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

జేఎన్‌టీయూ ప్రొ. డి.శ్రీనివాసరావు మృతి

బాలానగర్: జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ సీనియర్ ప్రొఫెసర్ డా. డి. శ్రీనివాస్‌రావు బ్రెయిన్ హేమరేజ్‌తో మృతి చెందారు. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డా. శ్రీనివాసరావు యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఈసీఈ డిపార్టుమెంట్‌లో చేరిన తరువాత పలు రకాల పదవులు పొంది ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించారు. డిపార్టుమెంట్ హెచ్ఓడీ, యూనివర్సిటీ ఆటిట్ డిపార్టుమెంట్ డైరెక్టర్‌గా, టెక్యూప్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.